

# కార్యాలయంలో చౌర్యం

"సులోచన"

ప్రొద్దున ఎనిమిది అయ్యీ అవకమునుపే నిండుగా ఉన్నతమైన ఉదరానికి ఫలహారం, కాఫీ పట్టించి—వచ్చి వక్కపలుకు గుప్పెడు నోట్లో పోసుకొని, తృప్తితీర నములుతూ, కళ్లజోడు అద్దాలప్రక్కల్నుంచి నాజూగ్గా చూస్తూ, తలగుడ్డ ఊడిపోతూందేమోనని మరీమరీ చూసుకొంటూ రంగుపట్టించిన వాసనమీసాల్ని దువ్వుకొంటూ, కొంకికర్ర వూగులాడిస్తూ—చెప్పులతో సవ్వడిచేస్తూ—ఆఫీసులో అడుగు పెట్టాడు మేనేజరు.

పనివాళ్లు తమ తమ పనుల్లో నిమగ్నులై బయట ప్రపంచాన్నే మరవబోతోన్న పరిస్థితిలో మేనేజరు వాళ్ళని చూస్తూ—ఎందుకో తన కుర్చీపైన గోడమీద గజంన్నర ఎత్తులోవున్న గడియారానికేసి చూశాడు. అందులో అతని వుద్దేశ్యం టైము ఎంతైయిందో చూద్దాం అని వుండొచ్చు. పోతే తన చేతిగడియారానికీ, ఆఫీసు గడియారానికీ భేదం చూచుకోదలచనూవొచ్చు. కాని మరీ విచిత్రమేమిటంటే, ఆ గడియారం అక్కడ లేదు. అక్కడ లేకపోవడమేకాకుండా ఆఫీసులో మరెక్కడా లేదు.

మేనేజరు నిలువునా కొయ్యబారాడు. భూమి నిజంగా విరుగుతూన్నట్టు కనిపించకపోయినా, ఆ చిహ్నాలు అగపడ్డయ్

"చౌర్యం జరిగింది,—చౌర్యం! మోసం, అప్రదిష్ట! అగౌరవం. పది సంవత్సరాలనుంచీ నేను పనిచేస్తున్నాను కాని యిటువంటి ఘోరమైన పని ఎన్నడూ జరుగలేదు. ఎక్కడ ఆ గడియారం? ఎవరు దొంగిలించారు? ఎవరు తలపడ్డారు?" మేనేజరు అరుస్తున్నారు.

పనివాళ్లంతా తమ పనులుచేయడం మానేసి మేనేజరుకేసి వింతగానూ, గోడకేసి ఆశ్చర్యంగానూ చూసి అందుకు కారణం తాము కాదన్నట్లు మెదలకుండా నిలబడి వూరుకున్నారు.

మేనేజరు కోపం మండిపోతున్నది. ఆయన రెండువిధాలుగా కోపాన్ని తెప్పించుకోగలుగుతున్నాడు గడియారం పోయింది. తొంభై రూపాయల నాశనం. బూడిదలో కలిసినై అవి ఒకటిన్నూ, రెండోది, ఆ గడియారం చాల శ్రావ్యంగా, కమ్మగా గంటలు కొడుతుంది. ఆ గంటల శ్రావ్యమైన మ్రోత అప్పుడప్పుడూ మేనేజరుగారికి కలలో, రాత్రులు వినపడుతూంటుందట. ఆ శ్రావ్యాన్ని వింటూనే పనివాళ్లు పనిని నిర్వహిస్తారు.

మేనేజరు కళ్లు ఎదుపుకు తిరిగినయ్. ఒక్కొక్క పనివాణ్ని నిలబెట్టి అడుగుతున్నాడు—"ఏరా ఎవరు తీసింది, చౌర్యంచేసింది" వాళ్లు గుడ్లు వెళ్ళబెట్టి, అర్థంకాక చూడటం తప్ప ఏమీ చెప్పలేకపోయారు.

ప్రక్క గదిలో గుమాస్తా రాతపుస్తకాల్లో మునిగి ఈ రభసంతా వినదలుచుకోనట్టు అందులో తనకి ఏమాత్రం బాధ లేనట్టు—రాసుకొంటున్నాడు. లెక్కలు, రావలసిన బాకీలూ, అవసరంగా ఖర్చుచేసిన ఖర్చులు. ఆదాయంలో ఖర్చుపోను నిలువ

దగ్గరకొచ్చి నిలబడ్డాడు మేనేజరు వారం క్రితంనుంచీ మేనేజరుకూ గుమాస్తాకూ సరిగా పడదు. ఎక్కడో లెక్కలు తప్పు రాశాడనీ, కూడికల్లో లెక్కలు తప్పులున్నవనీ మేనేజరు గూటిస్తే—అక్కడ బెడిసింది వ్యవహారం. ఏది ఏమైనా, ఆ గడియారం గుమాస్తాయే గట్టిగా దొంగిలించాడనే నమ్మకాన్ని మేనేజరు తనలో నిక్షిప్తపరచుకోలేకపోయాడు. ఏమీ చేయలేని అసమర్థుడిలా, అశక్తుడిలా వూరుకున్నాడు.

* * *

గుమాస్తా యాభై అయిదు రూపాయల జీతగాడు. ఆ వుద్యోగంలోనే ఆయన యెందుకు కుదిరిందీ, ఇంకా యెక్కువ చదువు చదివినా ఆ వుద్యోగంతప్ప గతి లేకపోవడానికి గల హేతువులు సహేతుకంగా చెప్పలేము గాని, మొత్తానికి ఏమీ దొరక్కపోయినపక్షంలో, జీవనం భారంఅయిన పరిస్థితుల్లో ఆవుద్యోగంలో ప్రవేశించాడనేదాన్ని మనం వొప్పుకుతీరాలి

నెల ఒకటింటికిగాను వొచ్చే యాభై అయిదు రూపాయలు అతనొక్కడే అయితే సరిపెట్టుకో వచ్చుగాని, తల్లివున్నది. ఉండేందుకు ఇల్లు—కట్టుకొనేందుకు బట్ట—తినేందుకు తిండి. ఈ కనీసపు కోర్కెలు తీరి యూసవుడుగా, ఈ లోకంలో, పెద్దమనుష్యుల మధ్యలో, నీతి అవినీతి రాద్ధాంతంలో—జీవించాలంటే, వెధవ యాభైఅయిదురూపాయలు చాలుతయ్యా, రెండు జీవాలకు? అయినా ఎలాగో ఓలాగున గడుపుకు వొస్తున్నాడు.

అయితే, అతనిలో అనాదిగా ఒక కోర్కె ఉండేది తనకు తల్లి కష్టపడి నానా అవస్థలూ పడి విద్య నేర్పించింది. పెద్దవాణ్ని చేసింది? ఈనాడు ఏదో ఉద్యోగంలోగూడ జేర్పించింది. కాని అలాటి తల్లికి తను పుట్టిన రోజు పండుగకు ఏం బహుమానం ఇవ్వగలిగాడు. ప్రతిసంవత్సరమూ ఈసమస్య సమస్యగనే నిలబడిపోయి, సంవత్సరాలు వెళ్ళమారడం అతనికి తల తీసేసినట్లు వున్నది

పోతే రేరే తల్లి యాభై రెండో జన్మదినోత్సవం. ఈసారన్నా ఏదో ఒకటి తల్లి సంతోషపడేట్టు బహుమానం ఇవ్వాలి. ఈ ఆలోచన అతనిలో బలంగా పాతుకుపోయింది. ఏ పనైనా చేయటానికి ఊతమిచ్చింది. డబ్బు! కావాలి? ఎలా వొస్తుంది?

ఆఫీసులో గడియారాన్ని దొంగిలించాడు, తప్పలేదు. తను చేసేది పచ్చి దొంగతనం—అని అతను ఇంకొంచెం సేపటికి తను ఆ గడియారాన్ని దొంగిలిస్తాడు అనగా ఏమాత్రం అనుకొనినా ఆపని చేసివుండేవాడుకాదేమో అన్న సందేహం తిం వాతమాట.

ఆఫీసులో గడియారం పోయింగింటే, ఆఫీసు మేనేజరుకూ, గుమాస్తాకూ, తక్కిన పనివాళ్ళకీ, ఆ ఆఫీసులో సంబంధంవున్న ప్రతివాడికీ అగౌరవమే అప్రతిష్టే! ఒకళ్ల ఇంట్లో దొంగలు పడ్డారంటే, ఆ యింటివారందరికీ అగౌరవమే—అవమానమే! ఒకడి జేబులో నోట్లు దొంగిలించారంటే వాడెంతో ఫీల్ అవుతాడు అట్లాగే మేనేజరూ, పనివాళ్లూ, చివరకు తనూ ఫీల్ కావాల్సివొస్తుందనే ఆలోచనకి రాలేకపోయాడు.

ఆ గడియారాన్ని భద్రంగా పట్టుకెళ్ళి ఒక పెద్దమనిషి దగ్గర పెట్టి ప్రస్తుతానికి అవసరమైన రూపాయలు తీసుకొచ్చుకొని, తల్లి జన్మదినోత్సవ సందర్భంలో ఆమెకు బహుమానముగా కొన్ని వస్తువులిచ్చి తృప్తిపరచినవాడై, తన హృదయంలో ఇన్నాళ్ళుగా పాతుకుపోయిన భారాన్ని తొలగించుకున్నాడు.

ఆఫీసులో మామూలుగానే పని చేస్తున్నాడు మేనేజరులో పూర్వపు ఉత్సాహం తగ్గినా, ఆ కోపాన్ని పనివాళ్ళమీద చీదరించుకోవటంలో తప్ప ప్రదర్శించలేకపోతున్నాడు. పాపం రోజు కొక్కసారన్నా ఆ గడియారంవుండే గోడకేసి చూసి తల దించేసుకుంటాడు.

నెలజీతం రాగానే గుమాస్తా గడియారం వున్న అతనికి యివ్వవలసిన డబ్బు యిచ్చి గడియారాన్ని ఇంట్లో పెట్టుకున్నాడు. అది కొట్టే గంటల శ్రావ్యాన్ని తనే హాయిగా వింటూ వుండేవాడు

* * *

రోజులు గడుస్తూనే వున్నయ్. ఆఫీసు పెద్దదైంది. పనివాళ్ళు ఒక్కొక్క మెట్టు పైకెగబ్రాకగలిగారు. గుమాస్తా ఇంకా ఇరవై రూపాయల యెక్కువ వుద్యోగంలోకి అమాంతంగా దూకగలిగాడు

ఈ పరిణామంలో గుమాస్తాకి, ఇన్నాళ్ళనుంచీ దరిద్రంకారణంగా, స్వజీవనం జరుపుకోలేకుండా వున్నాడని తెలిసిన మామయ్య "నాపిల్లను ఇటువంటి భ్రష్టులకిచ్చి గొంతుకొయ్యను" అని ఘంటాపథంగా వాగినవాడు, ఇవాళ ఇరవై రూపాయలు యెక్కువ జీతగాడే పిల్లనిచ్చి, కాస్తో కూస్తో అంటే ఇవ్వగలిగినంత కట్నం ఇస్తానని యింటిచుట్టూ తిరుగుతున్నాడు

గుమాస్తా తల్లి వొప్పించింది. ఒకమాత్రానికి ఒప్పుకోలేదు, గుమాస్తా ఈ సంబంధం కాకపోతే దీని తలదన్నే సంబంధాలు చాలా రావొచ్చు అని అన్నాడు కాని తల్లి "చుట్టాలు" నాయనా అని నచ్చచెప్పి వొప్పించింది.

పెళ్ళికి గుమాస్తా తన ఆఫీసులోనివాళ్ళందర్నీ పిలిచాడు. మేనేజరునీ. పనివాళ్ళనీ. చక్కని టీ పార్టీ ఏర్పాటు చేశాడు.

మధ్యాహ్నం మూడు గంటలకు అందరూ చక్కని కబుర్లు చెప్పుకొంటూ, నవ్వుకొంటూ, ఇకిలింపులు, సకిలింపులతో హాయిగా టీని చప్పరిస్తున్నారు.

మూడు గంటలైంది. ద్వారంపైన అడుగు దూరంలో వున్న గడియారం, టంగ్-టంగ్-టంగ్ మని మూడుదఫాలు కొట్టింది శ్రావ్యాతిశ్రావ్యంగా, అక్కడ వున్నవాళ్ళంతా అదిరిపోయారు. గడియారానికేసి ఒక్కదఫా కళ్ళు సన్నింటినీ తిప్పారు గోడవైపు. నివ్వెరపోయారు. ఆఫీసులో గడియారమే, కొన్ని సంవత్సరాల క్రిందట పోయింది. అదే శ్రావ్యమైన గంటలధ్వని మళ్లా వాళ్లంతా టీని చప్పరించేలోపల గుమస్తా తల్లి, గడియారాన్ని తీసి యింట్లో దాచింది. కొడుకు గౌరవాన్ని కాపాడాలనిన్నీ. నలుగురులో, శుభసమయంలో అప్రతిష్టపాలు కాకుండా వుండాలనీ!